క్లుప్తంగా

బీసీ బాలుర వసతి గృహంలో ప్రవేశాలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హాస్టల్ వార్డెన్ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న వివిధ ప్రాంతాల విద్యార్థులకు ఉచితంగా భోజన సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల ని సూచించారు. మరిన్ని వివరాలకు 93906 66787, 73865 77620 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సింగరేణి సర్క్యులర్లు డిజిటలైజేషన్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం నరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థ జారీ చేసే ప్రతీ సర్క్యులర్‌ను డిజిటలైజేషన్ చేయనున్నట్లు బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్ అన్నా రు. గోలేటిలోని జీఎం కార్యాలయంలోని కాన్ఫరె న్స్ హాల్‌లో మంగళవారం ఏరియాలోని అన్ని విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సంస్థ జారీ చేసిన ప్రతీ సర్క్యులర్‌ను డిజిటలైజేషన్ చేయాలన్నారు. డిజిటల్ రూపంలో ఉండే సర్క్యులర్లను ఎక్కడైనా.. ఎప్పుడైనా చూసే అవకాశం ఉంటుందని, అలాగే ఎంతకాలమైనా భద్రంగా ఉంటుందని పేర్కొన్నారు. అన్ని విభాగా ల అధికారులు తమ పాత సర్క్యులర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

సమ్మె నేపథ్యంలో చర్చలు

సింగరేణి సంస్థలో అద్దె ప్రాతిపదిక కొనసాగుతున్న ప్రైవేట్ వాహనాల యజమానుల సంఘం సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం గుర్తింపు సంఘం నాయకులు, అద్దె వాహనాల యజమానుల సంఘంతో ఇన్‌చార్జి జీఎం నరేందర్ చర్చలు జరిపారు. ప్రైవేట్ వాహన యజమానుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశాల్లో ఏజీఎం తిరుమల్‌రావు, పీవో సత్యనారాయణ, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, పర్సనల్ మేనేజర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'ఓటింగ్‌శాతం పెరగడం హర్షణీయం'

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో ఓటింగ్ శాతం పెరగడం హర్షణీయమని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2.50 లక్షల మైనస్‌గా ఉన్న ఓట్లను 78 వేలకుపైగా సాధించేందుకు శ్రమించిన నాయకులు, కార్యకర్తల కృషిని ఆయన కొనియాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, పెరిగిన ఓటింగ్ శాతం రానున్న ఎన్నికలకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తమ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటు వేసిన ప్రతిఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు అన్నివేళలా తాను అండగా ఉంటానని, ఓటమికి ఎవరూ నైరాశ్యం చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు

ఇంద్రవెల్లి: వర్షాకాలంలో పారిశుధ్యం లోపించ చర్యలు తీసుకుంటామని మేజర్ గ్రామపంచాయతీ ఈవో సంజీవ్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని బుద్ధనగర్, ప్రబుద్ధనగర్, మిలిందనగర్ కాలనీలో మంగళవారం ప్రైవేటు కూలీలతో పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగుకాల్వల పూడిక తొలగించారు. పంచాయతీ సిబ్బంది శంకర్‌లాల్ జైస్వాల్, గాయక్‌వాడ్ నారాయణ, ఇద్రిస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన

తాంసి: క్షయ వ్యాధిని అరికట్టేందుకు బీసీజీ వ్యాక్సినేషన్ వేయాలని భీంపూర్ వైద్యాధికారి నిఖిల్‌రాజ్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం భీంపూర్ పీహెచ్‌సీలో బీసీజీ వ్యాక్సినేషన్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. టీబీ సోకడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు తెలియజేయాలన్నారు. హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, స్టాఫ్‌నర్సు ప్రవీణ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అడవుల్లో జల సంరక్షణ



అడవుల్లో నీటి కుంటల పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

- విస్తృతంగా కుంటలు, కందకాల తవ్వకాలు
- ఉపాధిహామీ పథకం కింద పనులు
- కూలీలకు చేతినిండా పని
- వన్యప్రాణులకు ఏడాదంతా తాగునీటి సదుపాయం



సాసర్‌పిట్‌లో నీరు నింపుతున్న అటవీ సిబ్బంది

కెరమెరి: అటవీ ప్రాంతాల పునరుద్ధరణ.. వన్యప్రాణులకు తగిన ఆవాసం, నీటి సౌకర్యం కల్పించడంతో పాటు శివారు గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించడంపై అటవీ శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ యంత్రాంగం సంయుక్త కార్యాచరణతో ముందుకు సాగుతున్నాయి. అధికారులు ఉపాధిహామీ పథకం కొన్ని అటవీ పనులకు అనుసంధానించి కందకాలు, ఊటకుంట తవ్వకాలు చేపడుతున్నారు. జైనూర్, కెరమెరి మండలాల్లోని వివిధ గ్రామాల్లో గల అటవీ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు ఊతమిచ్చేలా పనులు కల్పిస్తూ వనసంరక్షణ చర్యలు చేపడుతుండడం గమనార్హం.

కొలత ఆధారంగా..

అటవీ శివారు గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పిస్తూనే వనసంరక్షణ దిశగా అడుగులు వేస్తున్నారు. ఈసారి ఉపాధిహామీ కూలీని రూ.300లకు పెంచిన ప్రభుత్వం అడవుల్లో వాన నీటి నిల్వకు కందకాలు తవ్విస్తుంది. ఒక్కో కూలి రోజుకు రెండున్నర ఫీట్లు పొడవు, ఫీటు వెడల్పు, ఫీటున్నర లోతులో కందకాలు తవ్వితే రూ.300 ఖాతాల్లో వేస్తోంది. దీంతో పాటు 12 ఫీట్ల పొడవు, వెడల్పు రెండు మీటర్లు లోతులో ఊట కుంటల పనులు చేపడుతుంది.

జోరుగా సాగుతున్నాయి..



అటవీ ప్రాంతంలో ఈ ఏడాది వేసవిలో చేపట్టిన జల సంరక్షణ పనులు జోరుగా సాగుతున్నాయి. అడవుల్లో చేపట్టిన పనులతో వన సంరక్షణ సాధ్యమవుతుంది. కందకాల తవ్వకాలతో అటవీ ప్రాంతాలకు రక్షణ సులభం. ఫారెస్టు శాఖ అనుమతితో 18 కుంటలకు ప్రతిపాదనలు పంపించాం.

– మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో, కెరమెరి

నిత్యం అందుబాటులో నీరు



నీటి లభ్యత కోసం కందకాలు, నీటి చెలిమెల తవ్వకాలు చేపట్టాం. దీంతో ఏడాది పొడవునా నీరు ఉండే అవకాశం ఉంటుంది. ఈసారి ఎండల తీవ్రతతో జింకలు సహ ఇతర వన్యప్రాణులకు సాసర్ పిట్లతో నీటిని అందించడం కష్టంగా మారింది. మేం తీసుకుంటున్న చర్యల వల్ల నీటి సమస్య ఉండదు.

– మజారోద్దీన్, ఎఫ్ఆర్‌వో, కెరమెరి

రేంజ్‌లో 25 బీట్లు..

కెరమెరి అటవీ రేంజ్ పరిధిలో కెరమెరి, జైనూర్ మండలాలు ఉన్నాయి. ఇందులో 25 బీట్లు, 10 సెక్షన్‌లు ఉన్నాయి. కాగా అడవుల పునరుద్ధరణపై దృష్టి సారించిన అటవీశాఖ అధికారులు ఉపాధిహామీ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. ఇందులో భాగంగా నీటి లభ్యత పెంపు, భూగర్భజల వనరుల అభివృద్ధికి సంబంధించిన పనులు చేస్తున్నారు. గుట్ట ప్రాంతాలు, బంజరు, అటవీ భూముల్లో కందకాల తవ్వకాలు చేపడుతున్నారు. వర్షాభావ పరిస్థితులు తట్టుకోవడం, వాన నీటి నిల్వ, వన్యప్రాణులకు రక్షణ తదితర వాటిపై దృష్టి సారించారు. గత ఆర్థిక సంవత్సరంలో కెరమెరి, జైనూర్ మండలాల్లో చాలా చోట్ల నీటి చెలిమెలు తవ్వారు. 575 గుంతలు, వరద నీటిని ఒడిసి పట్టేందుకు 175 కందకాలు, 23 ఊటకుంటలు, 52 మళ్లింపు కాల్వల తవ్వకాలు, 238 చిన్న నీటి కుంటల నిర్మాణాలను అటవీశాఖ చేట్టింది. కాగా అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల నీటి కోసం 29 సాసర్ పిట్లు ఏర్పాటు చేశారు. వన్యప్రాణులకు నిరంతరం దాహం తీరేలా చర్యలు చేపడుతున్నారు.

దొంగల కలకలం..!

- జిల్లాలో హల్‌చల్
- వరుస దొంగతనాలు
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్



కాగజ్‌నగర్‌లో దొంగతనం సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

కౌటాల: జిల్లాలో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవల కాగజ్‌నగర్ పట్టణంలోని రెండు ఇళ్లల్లో దొంగతనాలు చోటు చేసుకున్నాయి. దీంతో పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లో దొంగతనాలు తరుచూ చోటు చేసుకుంటున్నాయి. నేరాల నియంత్రణకు ఆయా మండలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా దొంగలు చాకచక్యంగా తమ పని ముగించుకొని వెళ్తున్నారు. పోలీస్ పెట్రోలింగ్, తనిఖీలు, కార్డన్‌సెర్చ్ నిత్యం కొనసాగుతున్నా అందరి కళ్లుగప్పి చోరీలకు పాల్పడుతూ పోలీసులకు దొంగలు సవాల్ విసురుతున్నారు.

పగలంతా రెక్కీ..

ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్తే ఇళ్లను దొంగలు గుల్ల చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన దొంగతనాలన్నీ రాత్రి సమయంలో జరిగినవే. తాళం వేసి ఉన్న ఇళ్లల్లో, ఆలయాల్లో వరుసగా చోరీలు చోటు చేసుకున్నాయి. ఆయా ఘటనల్లో పెద్ద ఎత్తున నగదు, బంగారం, వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. దొంగలు పగలు ఆయా కాలనీల్లో తిరిగి రెక్కీ నిర్వహించి, తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తారు. అదేరోజు రాత్రి గుర్తించిన ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడైనా చోరీ జరిగినట్లు గుర్తిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

వరుస దొంగతనాలు

ఈ ఏడాది మొదట్లో ఆలయాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడిన దుండగులు, ప్రస్తుతం ఇళ్ల మీద పడ్డారు. జిల్లాలోని సగం మండలాలు మహారాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. కాగజ్‌నగర్, రెబ్బెనలో రైల్వే మార్గాలు ఉండడంతో పొరుగురాష్ట్రం నుంచి వచ్చి చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్నారన్న సమాచారం ఉంది. ఏటా జిల్లాలో 80కి పైగా దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో రూ.లక్షల్లో నగదు, విలువైన ఆభరణాలు చోరీకి గురవుతున్నాయి. కానీ రికవరీ మాత్రం అంతంత మాత్రంగానే ఉంటుంది.

ఇటీవల జరిగిన దొంగతనాలు..

- ఈ నెల 3న కాగజ్‌నగర్ పట్టణంలో ఆర్టీసీ బస్సులో దొంగతనం జరిగింది. బెజ్జూర్ మండలం రెబ్బెన గ్రామానికి చెందిన చిలుక సుజాత బెజ్జూర్ నుంచి ఆర్టీసీ బస్సులో కాగజ్‌నగర్ రాగా బస్సులోనే రూ.1,18,750 విలువ గల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు.
- ఈ నెల 1న కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడలో మహ్మద్‌సర్దార్ అలీ నివాసంలో చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.లక్ష 50 వేల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.
- మే 21న కాగజ్‌నగర్ మెయిన్ మార్కెట్‌లోని రాజస్తాన్ భవన్‌లోని కిరాణాదుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి యత్నించారు.
- మే 16న కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మొబైల్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు.

కళాయాత్ర ముగింపు పోస్టర్ విడుదల

మంచిర్యాలటౌన్: జిల్లాకు చెందిన కళాకారుడు వేల్పుల పోచం మొట్టమొదటిసారిగా కళాయాత్ర పేరుతో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన యాత్ర ఈ నెల 7వ తేదీన ముగియనుంది. ఈ సందర్భంగా ముగింపు పోస్టర్లను జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. తమిళనాడులోని కన్యాకుమారి వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ముగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అచ్చిబాబు, రమేశ్, డాక్టర్ శ్రీనివాస్, ముత్యం శ్రీనాథ్, వెంకటేశ్వర్లు, మోహన్, గణపతి రెడ్డి, సాగర్ యాదవ్, మోహన్ యాదవ్, బండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



కథల పుస్తకాలు అందజేస్తున్న వెంకన్న

పెంచికల్‌పేట్: గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రూమ్ టూ రీడ్ కార్యక్రమం కోఆర్డినేటర్ వెంకన్న అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో మంగళవారం విద్యార్థులకు కథల పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు సమయం వృథా చేయకుండా ఉచితంగా అందిస్తున్న కథల పుస్తకాలను వినియోగిస్తూ పఠన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు కథలు వినడానికి 040-45209722 నంబరుకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు నిల్

- ఇబ్బందులు పడుతున్న కూలీలు
- పట్టించుకోని అధికారులు



లంజన్వీర గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వాంకిడి: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధుల్లో పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది పనులు ప్రారంభమైన మొదట్లో కూలీలకు పని ప్రదేశాల్లో తప్పనిసరిగా టెంట్లు ఏర్పాటు చేయాలని జిల్లా స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామ పంచాయతీల నుంచి గ్రీన్ నెట్‌లు సప్లయ్ చేసి పని ప్రదేశాల్లో ఏర్పాటు చేసేవారు. పలు జీపీల్లో సప్లయ్ చేసిన నెట్‌లు కొన్ని వారాలకే పాడైపోవడంతో అప్పటి నుంచి టెంట్‌లు ఏర్పాటు చేయడం మరిచిపోయారు. ఈ ఏడాది 45 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా పని ప్రదేశంలో టెంట్‌లు ఏర్పాటు చేయకపోవడంతో కూలీలు సేద తీరేందుకు నీడ లేకుండా పోయింది. టెంట్‌తో పాటు తాగునీరు, వడదెబ్బకు గురైతే అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉంచాలని ఆదేశాలు ఉన్నప్పటికీ స్థానిక అధికారులు మాత్రం ఇవేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మంగళవారం లంజన్వీర గ్రామసమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను 'సాక్షి' పరిశీలించగా గత కొన్ని వారాల నుంచి ఎలాంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచడం లేదని తెలిసింది.

బీజేపీ శ్రేణుల సంబురాలు



ఆసిఫాబాద్‌అర్బన్: టపాసులు కాలుస్తున్న నాయకులు



ఆసిఫాబాద్‌రూరల్: వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో మంగళవారం సాయంత్రం బీజేపీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా గోడం నాగేశ్‌తో పాటు కేంద్రంలో మళ్లీ ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బీజేపీ నాయకులు బాణాసంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, బీజేపీకి ఓటు వేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్, భూమయ్య, మిథున్, చందు, మధుకర్, తిరుపతి, అశోక్, బాబురావు, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో మంగళవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో బీజేపీ ఘన విజయం సాధించడంతో మండలంలోని మోతుగూడ, బూర్గుడ, ఈదులవాడతో పాటు పలు గ్రామల్లో బీజేపీ నాయకులు టపాసులు పేల్చుతూ ఒకరికిఒకరు స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బర్ల నగేశ్, శ్రీనివాస్, గంగన్న, పొచ్చయ్య, రాము, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల విజయోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీ ఏ కూటమి విజయంతోపాటు రాష్ట్రంలో ఎని మిది ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవడంతో జిల్లా కేంద్రంలో మంగళవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబురాలు నిర్వహించా రు. ఆలయాల్లో పూజలు చేసి స్వీట్లు పంచి పెట్టారు. టపాసులు పేల్చి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్, నాయకులు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన ప్రత్యేక పాలన!

- సమస్యల్లో పంచాయతీలు
- కొరవడిన పారిశుధ్యం
- భగీరథ పైప్‌లైన్లకు లీకేజీ
- సతమతమవుతున్న ప్రజలు



ఉప్రీ పల్లె ప్రకృతివనంలో ఎండిన మొక్కలు



మాన్యాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

నార్నూర్: పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. ఒక్కో అధికారికి రెడు, మూడు పంచాయతీల బాధ్యతలు అప్పగించటం, వారు చుట్టపు చూపుగా పల్లెల్లో పర్యటిస్తుండటంతో సమస్యల చిట్టా క్రమేణా పెరుగుతోంది. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలు, చేతిపంపులు మరమ్మతుకు నోచుకోకపోవటం, పారిశుధ్యంపై పర్యవేక్షణ కొరవడటంతో ప్రజలు సతమతమవుతున్నారు.

భారంగా విధుల నిర్వహణ

నార్నూర్‌లో 23, గాదిగూడ మండలంలో 25 మొత్తం 48 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ఈ ఏడాది జనవరి నెలాఖరుకు గ్రామాల్లో పాలకవర్గాల గడువు ముగియటంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది. ఒక్కో అధికారి రెండు, మూడు పంచాయతీల్లో పాలనను పర్యవేక్షించటం రోజువారీగా సాధ్యం కావటం లేదు. కనీసం వారానికోసారైనా ఆయా గ్రామాల్లో పర్యటించలేకపోతున్నారు. దీనికి తోడు వీరికి సొంత శాఖ విధులు ఉంటాయి. ఉన్నతాధికారులతో సమీక్షలు, సమావేశాలకు హాజరుకావాలి. కొంతమంది సాకులు చెప్పి విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇంకొందరు ప్రత్యేక విధుల పేరిట పూర్తి సమయం కేటాయించటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎక్కడిసమస్యలు అక్కడే దర్శనం ఇస్తున్నాయి.

ఇదిగో సమస్యల చిట్టా

గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మిషన్ భగీరథ పైపులైన్లు చాలాచోట్ల లీకై నీటి సరఫరా సక్రమంగా జరగటం లేదు. పాడైన బోర్లను బాగు చేయించేవారు కరవయ్యారు. నీళ్లు పోయకపోవటంతో హరితహారం మొక్కలు ఎండిపోతున్నాయి. నర్సరీల సంరక్షణ సక్రమంగా సాగటం లేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు దాదాపు 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులు రెండు నెలలకోసారి మంజూరవుతున్నా సరిపోక పంచాయతీలకు ఇక్కట్లు తప్పటం లేదు. పాలకవర్గం ఉన్న సమయంలో అప్పోసప్పో తెచ్చి గ్రామాల అభివృద్ధికి సర్పంచులు పూనుకునేవారు. బిల్లులు మంజూరైనప్పుడు తీసుకునేవారు. ఇప్పుడు పంచాయతీల్లో నిధుల లేమితో అధికారులు పట్టించుకోవటం లేదు. దీంతో ఏ గ్రామం లోచూసిన పారిశుధ్యం లోపం కనిపిస్తోంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో వీధి దీపాలు లేక గ్రామాలు అంధకారంలో ఉంటున్నాయి. ప్రత్యేకాధికారులు గ్రామ పంచాయతీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పర్యటించేలా చర్యలు తీసుకుంటాం. కార్యదర్శుల ద్వారా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి పర్యవేక్షిస్తాం. - ప్రభాకర్, డీఎల్‌పీవో

జనసైనికుల సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న జనసేన నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో నియోజకవర్గం ఇన్‌చార్జి మరియాల వినీత్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు సాయితేజ, రమేశ్, రవి, అఖిల్, రాజు, రాహుల్, శ్యాం, లక్కి, సాయికృష్ణ, శ్రీకాంత్, తిరుపతి, శ్రవణ్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వాంకిడి: మండలంలోని బెండార గ్రామానికి చెందిన నగోషె అర్జున ఇంట్లో 11 బస్తాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 5.30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన బియ్యం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

లింగాపూర్‌లో వర్షం

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. పంటల సాగు ప్రారంభిస్తున్న సమయంలో వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సర్‌సిల్క్, పెట్రోల్‌పంపు, స్టేషన్ రోడ్డు, ఓల్డ్‌కాలనీ ఏరియాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ కమలాకర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.